
# ఆ జవాబుకి ఓ ప్రశ్న

— పృథ్వీరాజు



**సోమసుందర్ ఆఫీసుకి వెళ్లగానే శ్రీపతి చెప్పాడు- "అటెండెన్స్ రిజిస్టర్ బాస్ రూమ్‌లో ఉంది. ఇప్పటికే నీ మీద కారాలు, మిరియాలు నూరుతున్నాడు."**

"మన బాస్ ఎప్పుడూ ఇంతే! ఇంట్లోని మసాలా వర్క్ కూడా ఆఫీసుకే తెచ్చుకుంటాడు. ఏ పనీ సకాలంలో పూర్తి చేయడం తెలియదు" అన్నాడు రమేష్.

ఆ మాటకు చిన్నగా నవ్వుకుంటూ బాస్ కాబిన్‌లోకి వెళ్లాడు సోమసుందర్.

వెళ్లగానే విష్ చేశాడు. దానికి బాస్ ప్రతిస్పందించలేదు. కనీసం చిరునవ్వు కూడా నవ్వలేదు. కోపం అతని ముఖంలో ప్రస్ఫుటంగా కనబడుతోంది.

"ట్రాఫిక్ జామ్ అయింది. అందుకే లేట్! ఐయామ్ సారీ!" అన్నాడు సోమసుందర్.

దానికి బాస్ రాజారామ్ సీరియస్‌గా "నాకవన్నీ అనవసరం! నువ్వు పదిన్నరకల్లా నీ సీట్లో ఉండాలి. ఇప్పటికే ఈ నెలలో నాలుగోసారో, అయిదోసారో నువ్వు లేట్‌గా రావడం. నువ్వు రిజిస్టర్‌లో సైన్ చేయడానికి అంగీకరించను" అన్నాడు.

"సిటీ లైఫ్‌లో అన్నింటిలోనూ అందరికంటే ముందుండాలి? ప్రతి ఒక్కరూ పరుగులు తీస్తుంటారు. కావాలని ఏ ఒక్కరూ లేట్ చేయరు! మీరే ఆలోచించండి- ఈ రద్దీ సమయంలో డైరెక్ట్ బస్ దొరక్కపోవచ్చు, లేదా ట్రాఫిక్ జామ్ కావచ్చు. నాకూ నా బాధ్యత తెలుసు కదా! సరే... ఎలాగూ లేట్ అయింది కాబట్టి ఈ రోజు లీవ్ తీసుకుంటాను" అన్నాడు సోమసుందర్.

"ససేమిరా ఇవ్వను! ఎప్పుడు కావాలంటే అప్పుడు- కారణం లేకుండా సెలవంటే ఎట్లా? అయినా పెండింగ్ వర్క్ చాలా ఉంది. వెళ్లి మీ పని చూసుకోండి!" అరిచినట్లు చెప్పాడు రాజారామ్.

చాలా ఫీలవుతూ వెళ్లి సీట్లో కూర్చున్నాడు

సోమసుందర్. అన్యమనస్కంగానే పని ప్రారంభించాడు.

ఆలస్యమే పది నిమిషాలు చూస్తాడు తప్పితే, సాయంత్రం అయిదున్నర దాటినా రాత్రి ఎనిమిది - పదీ వరకూ చేసే వర్క్ మరిచిపోతుంటే ఎట్లా?

తన కీ ఉద్యోగం వచ్చి ఇప్పటికి ఆరేళ్లు! తను చదివిన చదువుకి, చేసే ఉద్యోగానికి సంబంధం లేదు. లెక్చరర్ కావాలనే కోరిక ఎం.ఏ. తెలుగు లిటరేచర్ చేశాడు. లెక్చరర్ ఉద్యోగం రాలేదు.

పీ.జి. అయ్యాక కూడా తండ్రి మీద ఆధారపడి జీవించలేడు కదా! బ్రతుకు తెరువు కోసం కొంత కాలం ట్యుటోరియల్ కాలేజీలో పని చేశాడు.

కనీసం ట్యూషన్స్ చెప్పుకోవాలన్నా మాథ్స్, సైన్స్, కామర్స్, ఇంగ్లీష్ తప్పితే ఇతర సబ్జెక్టులలో ఎవరూ ప్రైవేట్ చెప్పించుకోరని అనుభవపూర్వకంగా అర్థమయ్యేటప్పటికి ఆలస్యమైంది.

స్టాఫ్ సెలక్షన్, బ్యాంక్ క్లర్క్స్, ఎ.పి.పి.ఎస్.సి., ఎల్.ఐ.సి. ... ఒకటనేమిటి, పేపర్లో పడ్డ ప్రతి ఉద్యోగానికి అప్లై చేశాడు.

రెండేళ్లపాటు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాయగా రాయగా... చివర కీ ఉద్యోగం వచ్చింది. తను చేయాల్సిన గుమాస్తా లెక్కలకు... తిక్కన్న, ముక్కు తిమ్మన పద్య సౌరభాలకు ఏ మాత్రం సంబంధం లేకుండా పోయింది.

కేవలం మూడు వేల ఆరొందల రూపాయల కోసం, అవీ ప్రతి ఫస్ట్ తారీఖున క్రమం తప్పకుండా అందుకునే భద్రత కోసమే ఈ ఉద్యోగం చేయడం.

తను నేర్చుకున్న కాసింత విద్య, ఉన్న ప్రతిభ బూడిదలో పోసిన పన్నీరు అయింది.

యాంత్రికంగా పనిచేస్తున్నాడన్న మాటేగాని, ఆలోచనలు మనసుని దొలిచేస్తున్నాయి.

ఇక ఈ ఉద్యోగంలో ఎదుగూ-బొదుగూ లేదు. పనిని గుర్తించి మెచ్చుకునే మాట ఎలా ఉన్నా - ఏ చిన్న తప్పు దొరుకుతుందా - ఆ పొరబాటును కళ్లెంగా మెడకి బిగించి స్వారీ చేద్దామా అనుకునే బ్యూరోక్రాట్ మనస్తత్వమే ఎక్కువ!

తనేం చేయగలడు? ఈ రోటీన్ విషవలయం నుంచి, గుమాస్తా జీవితం నుంచి ఎలా బయట పడగలడు? ఎలా జీవితాన్ని తీర్చిదిద్దుకోగలడు? జాబ్ శాటిస్‌ఫాక్షన్ పొందటం ఎలా?

* * *

సాయంత్రం ఇంటికి రాగానే భార్య వకుళతో అదే మాటన్నాడు. "బొత్తిగా జీవితంలో వృత్తిపరమైన సంతృప్తి అనేది లేకుండాపోయింది. మరీ గానుగెద్దు బ్రతుకు అయిపోయింది" అన్నాడు.

వకుళ అతని ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది ఒక్క నిమిషం. 'ఏమైంది?' అని ఆరా తీసింది.

ఆఫీసులో తన అనుభవాలన్నీ పూస గుచ్చినట్లు చెప్పాడు సోమసుందర్. అతని మాటల్లో ఆవేదన, ఆవేశం ఒక దానితో ఒకటి పోటీ పడ్డాయి.

అదంతా విని నవ్వింది వకుళ.

తన బాధను అంత తేలికగా తీసుకుని వకుళ నవ్వడం సోమసుందర్‌కి సుతరామూ నచ్చలేదు. "ఎందుకు నవ్వుతున్నావు?" అన్నాడు.

"మీరు చెప్పుకోవడానికి నే నయినా ఉన్నాను. మరి నా గోడు వినే దెవరు?" అన్నది వకుళ.

"ఏం - నీ కేమిటి బాధ?" అన్నాడు సోమ సుందర్ అసహనంగా.

"మీరు చదివిన తెలుగు సాహిత్యానికి, చేస్తున్న గుమాస్తా ఉద్యోగానికి మధ్య ఎంత దూరం ఉందో? అలాగే నా జీవితం! బి.కాం చదివాను. ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసయ్యాను. టైప్, షార్ట్‌హ్యాండ్ వచ్చు. హిందీ ప్రవీణ వరకూ చదువుకున్నాను. నా అంత తెలివైనది, చురుకైనది మరొకరూ లేరని మా అమ్మా నాన్నే కాదు - మా చుట్టాలు, మా మేష్టార్లు, నా ఫ్రెండ్స్ మెచ్చుకునేవారు. పెళ్లయ్యాక నా చదువుకు, ఇంటి పనులకు ఏ మాత్రం సంబంధం లేదు. అంట్లు తోమడానికి, బట్టలు ఉతకడానికి, వంట వండటానికి, పిల్లల్ని సాకడానికి చదువు రావలసిన అవసరం లేదుగా! కేవలం నేను నేర్చుకున్న అక్షరాలు పత్రికలు చదువుకోవడానికి తప్ప, మరో దానికి పనికి రావడం లేదు. నా పని ఎంత మెకానికల్‌గా సాగిపోతోందో చూశారా! తెల్లవారుజామునే లేస్తాను. వంట వండుతాను. పిల్లలకు అన్నం తినిపించి, స్కూల్‌కి రెడీ చేస్తాను. ఈలోగా మంచి నీళ్లు వస్తాయి, పడతాను!

"అది చేసి నా స్నానం, పూజ పూర్తి చేసుకునే టప్పటికి మిమ్మల్ని ఆఫీసుకి పంపించే ఏర్పాట్లు చేయాలి. మీరు వెళ్లాక బట్టలు ఉతుక్కోవడం, కాసేపు కేబుల్ టీవిలో సినిమా చూడటమో, ఏ పత్రికో చదువు కోవడమో...? మళ్లీ నాలుగింటికి పిల్లలు వచ్చేస్తారు! ఇక వాళ్ల తిండి, హోమ్‌వర్క్, సాయంత్రం మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు తెచ్చుకోవడం - మళ్లీ వంట, ఇల్లు సర్దుకోవడం. రొటీన్! కేవలం మీ అందరి మీద ఉన్న మమకారమే నా కెంత చిరాకు, అసహనం కలిగినా ఈ పనులు చేయిస్తోంది. మీరు నా వంటని ఎప్పుడో... ఏ ఏడాది కోసారి మెచ్చుకుంటారు.

"నాకు పని గంటలు లేవు, సెలవులు లేవు - జీతభత్యాలు లేవు! కనీసం చేసే పనిలో మొద్దు బారిన రొటీన్‌తనమే తప్ప, రవ్వంత ఆసక్తి కూడా లేదు. మరి నాకు జాబ్ శాటిస్‌ఫాక్షన్ లభించాలంటే ఏం చేయాలి?" అడిగింది వకుళ.

ఆ ప్రశ్నకు కంగారు పడ్డాడు, కలవర పడ్డాడు సోమసుందర్. తను జవాబు కోసం అన్వేషిస్తుంటే మళ్లీ వేరే ప్రశ్న వచ్చి ఎదుట నిలిచింది!

ఇప్పుడేం చేయాలి?

రొటీన్ తేనెతుట్టలోనే, అసంతృప్తి తేనె టీగలు ఎన్ని కుట్టినా మధువును గ్రోలాలా?

జీవితంతో రాజీపడి తనూ బ్రతికేస్తూ, భార్యని అలాగే జీవించమని చెప్పాలా?

లేక... ఈ అసంతృప్తులను అంగీకరించి, మానసిక శాంతి, తృప్తి కలిగించే జీవిత విధానం కోసం అన్వేషించాలా?

సోమసుందర్‌కి భయమేసింది. జవాబు దొరకలేదు. రెట్టింపయిన ప్రశ్నలతో అతను పరిష్కారం గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. అతనికేదో సమాధానం దొరకాలని ఆశిద్దాం! ●

